

7,931మందికి రూ.11.89 కోట్లు

ఈబీసీ నేస్తం పథకం రెండో విడతలో భాగంగా 7,931 మందికి రూ.11.89 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

8లో



సిటీలో షూటింగ్‌ల సందడి

సిటీలో సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, విక్టరీ వెంకటేష్ షూటింగ్ కోసం నగరానికి చేరుకున్నారు.

8లో



పీఎంపాలెంలో భూమాయగాళ్లు

పీఎంపాలెంలో భూదందాలు ఆగడం లేదు. తాజాగా మరో భూ కబ్జాదారుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో

ఎన్నాళ్లో వేచిన ఉదయం

డీఎస్సీ–98లో క్వాలిఫైడ్ అభ్యర్థుల కల నెరవేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కోరిక తీరింది. పారదర్శకంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కోరుకున్న పాఠశాలలో పని చేసే అవకాశం లభించింది. డీఈవో కార్యాలయ అధికారులు వారికి నియామక పత్రం అందించిన వేళ.. ఆనందంతో ఉబ్బితబ్బిబయ్యారు. ఇచ్చిన మాట మేరకు కొలువులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొట్టారు. 25 ఏళ్ల ఎదురుచూపులకు మోక్షం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరుడు వెంకట రమణమూర్తికి ధ్రువపత్రం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



కోరుకున్న చోటు ఎంచుకొని సంతకం చేస్తున్న అభ్యర్థి

- డీఎస్సీ- 98 నియామకాలు షురూ..
- 355 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోట పోస్టింగ్

విశాఖ విద్య: ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ–98లో ఎంపికైన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన అభ్యర్థులకు బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు 355 మందిని అర్హులుగా తేల్చి, తొలి రోజు జాబితాలోని 1 నుంచి 200 మంది వరకు కౌన్సెలింగ్‌కు పిలిచారు. 355 మందిలో ఇద్దరి వయసు 60 సంవత్సరాలు దాటగా.. మరో ఇద్దరు చేరేందుకు ఆమోదం తెలపలేదు. తొలి రోజు కౌన్సెలింగ్‌కు 184 మంది హాజరు కాగా.. 12 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, డీఈవో చంద్రకళ, అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో ఒక్కో అభ్యర్థిని పిలిచి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను ముందుగానే ప్రకటించారు. 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యమిచ్చి ఖాళీల జాబితాను సిద్ధం చేశారు. దీంతో దాదాపుగా అందరికీ తమ నివాస ప్రాంతాలకు సమీప మండలాల్లోనే పోస్టింగ్‌లు లభించాయి. 93 మంది మైదాన ప్రాంతంలో, 91 మంది ఏజెన్సీ ప్రాంతంలో చేరారు. మిగిలిన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, డీఈవో చంద్రకళ తెలిపారు.

ఇన్నాళ్లకు అవకాశం వచ్చింది.. కానీ



ఉపాధ్యాయ శిక్షణ అనంతరం ప్రైవేట్ స్కూల్లో టీచర్ వృత్తి ప్రారంభించాను. 20 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులను బోధిస్తాను. నెలకు రూ.22 వేల వేతనం ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేయాలనే కోరికతో డీఎస్సీ–98లో మెరిట్‌లో నిలిచాను. ఇన్నాళ్లకు అవకాశం దక్కింది. కానీ 60 ఏళ్లే రిటైర్మెంట్ వయసు కావడంతో.. నాలాంటోళ్లకు ఆనందం దూరమైపోయింది. జూన్ 1తో నాకు 60 ఏళ్లు నిండిపోతాయి. 62 ఏళ్లు చేస్తే నాలాంటోళ్లకు మేలు జరుగుతుంది.

– జీఎల్ఎన్ శాస్త్రి, అనకాపల్లి

పిల్లలకు పాఠాలు చెప్పడం ఇష్టం



గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పాలనాధికారిగా పనిచేస్తున్నాను. ఫ్యాక్టరీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయాలనేది చిరకాల కోరిక. పిల్లలకు పాఠాలు చెప్పడం అంటే మహా ఇష్టం. ఇన్నాళ్లకు ఆ కల నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే ఇది సాధ్యమైంది.

– పి.వెంకట రమణమూర్తి, గోవాడ, అనకాపల్లి జిల్లా

సీఎం జగన్ వల్లే ఈ ఉద్యోగం



డీఎస్సీలో అర్హత సాధించినా.. ప్రభుత్వ ఉద్యోగం దక్కలేదనే బాధ ఉండిపోయింది. ఇన్నాళ్లకు టీచర్‌గా పని చేసే అవకాశం దక్కింది. ఇంకో ఆరేళ్లకు పైగానే ఉద్యోగం చేస్తాను. ఇంట్లో పిల్లలకు పాఠాలు చెప్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్దుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వ బడిలో పిల్లల అభివృద్ధికి పాటుపడతాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్లే మాకు ఉద్యోగాలు వచ్చాయి. అందుకే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– పి.లక్ష్మి, మధురవాడ, విశాఖ జిల్లా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



డీఎస్సీ–98లో ఎంపికైన వారి గురించి పట్టించుకుని, ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. మా గురించి గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇంకా తొమ్మిదేళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తాను. మా మండలంలోనే పోస్టింగ్ వచ్చినందుకు మరింత ఆనందంగా ఉంది.

– దొండా చిన వెంకన్నదొర, వీరవిల్ల అగ్రహారం, అనకాపల్లి జిల్లా

ప్రశాంత విశాఖే లక్ష్యం

- మహిళా భద్రతకు ప్రాధాన్యం
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి
- మాదకద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి
- విశాఖలో డీసీపీగా పనిచేసిన అనుభవం ఉంది
- పోలీస్ కమిషనర్‌గా త్రివిక్రమ్ వర్మ బాధ్యతల స్వీకరణ



త్రివిక్రమ్ వర్మకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న బదిలీ అయిన శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రశాంత విశాఖే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. బుధవారం విశాఖ నూతన పోలీస్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సీపీగా విధులు నిర్వర్తించిన సీహెచ్.శ్రీకాంత్ నుంచి ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ త్రివిక్రమ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ విశాఖలో 2015–16 సంవత్సరంలో డీసీపీగా పనిచేసిన అనుభవం ఉందని వెల్లడించారు. ఆ సమయంలో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, ఇతర భారీ కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం ఉందని తెలిపారు. విశాఖలో మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా విషయంలో విశాఖ కేవలం ట్రాన్సిట్‌గానే ఉందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా మత్తుపదార్థాలను రవాణా చేసే వారి వివరాలను ఇప్పటికే తమ వద్ద ఉన్నాయని వివరించారు. అటువంటి వారిపై గట్టి నిఘా పెట్టి విశాఖ నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు చెక్ పెడతామని స్పష్టం చేశారు. విశాఖను మాదకద్రవ్య రహిత నగరంగా మార్చడానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా నగరంలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెడతామని, ఎటువంటి అసాంఘిక, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశాఖలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నగరాభివృద్ధికి దోహదపడేలా అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

డీసీపీలు, ఏసీపీలతో సమావేశం

కొత్త సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం త్రివిక్రమ్‌వర్మ ముగ్గురు డీసీపీలతో పాటు, ఇతర పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. నగరంలో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు.

అప్పన్నను దర్శించుకున్న సీపీ త్రివిక్రమవర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం సీపీ డాక్టర్ త్రివిక్రమవర్మ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో త్రినాథరావు అందజేశారు.



కుటుంబసమేతంగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుంటున్న సీపీ త్రివిక్రమవర్మ

డీసీపీగా విద్యాసాగర్‌నాయుడు



నగర నూతన డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా వాసన్ విద్యా సాగరనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీసీపీగా ఉన్న సుమిత్ సునీల్ గరుడ్ నుంచి ఛార్జ్ తీసుకున్నారు. అనంతరం ఆయన సీపీ త్రివిక్రమ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీపీ త్రివిక్రమ్ వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడులను పోలీస్ అధికారులు కలిసి అభినందలు తెలిపారు.

వైజాగ్ @ 40.2!

- నిప్పులు చెరిగిన భానుడు
- ఈ సీజనులో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత
- నేడు, రేపు కొనసాగనున్న ఉష్ణతాపం
- వడగాడ్పులకు అవకాశం



నిర్మానుష్యంగా జాతీయ రహదారి



సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భానుడు భగ్గుమన్నాడు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా బుధవారం 40.2 డిగ్రీల ఉష్ణతాపాన్ని వెదజల్లాడు. సాధారణంగా విశాఖలో ఏప్రిల్‌లో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 37–38 డిగ్రీలకు మించవు. అంతకు మించి ఉష్ణోగ్రతలు అరుదుగా నమోదవుతాయి. విశాఖ జిల్లాలోను, నగరంలోను గత కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. బుధవారం నాటికి అవి మరింత తీవ్రతరమయ్యాయి. విశాఖతో పాటు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో 40.56, ములగాడ మండలం నావల్ వార్ఫ్‌లో 40.51, పద్మనాభం మండల కేంద్రంలో 40.09, సింహాచలంలో 40, గాజువాకలో 39 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉదయం నుంచి మొదలైన ఎండ మధ్యాహ్నానికి ఉధృతమైంది. అలా సాయంత్రం నాలుగు గంటల వరకు ఉష్ణ తీవ్రత కొనసాగింది. వేసవి తాపానికి జనం విలవిల్లాడారు. సాయంత్రం అయ్యే వరకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. సాధారణ ఉష్ణోగ్రతలకంటే 4.5 డిగ్రీలకు మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైతే వడగాడ్పులుగా నిర్ధారిస్తారు. బుధవారం విశాఖలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది సాధారణంకంటే 4.9 డిగ్రీలు అధికం. వరసగా రెండు రోజులు ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగితే వడగాడ్పుల హెచ్చరికలు జారీ చేస్తారు. రానున్న రెండు మూడు రోజులు ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు.

సాహిత్య విమర్శకు మార్గదర్శకుడు రాచపాలెం

సీతంపేట: విమర్శకులకే విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అని ఆచార్య వెలమల సిమ్మన్న అన్నారు. సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం రాచపాలెం చంద్రశేఖరరెడ్డి సాహిత్య విమర్శ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. రాచపాలెం చంద్రశేఖరరెడ్డి తమ సుదీర్ఘమైన బోధన అనుభవం, నిరంతర అధ్యయనం, ప్రాపంచిక దృక్పథంతో విమర్శ చేశారన్నారు. ఈ పనిని అందరూ చేయలేరని, ఆయన దీనిని ఒక సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా పునర్ మూల్యాంకన విమర్శలో విశేషమైన కృషి చేసి అందనంత ఎత్తుకు ఎదిగారన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు చెందిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి సమకాలీన సాహిత్య విమర్శకుల్లో ప్రసిద్ధి పొందారన్నారు. నాలుగు దశాబ్దాల సాహిత్య జీవితంలో 30 పుస్తకాలు రచించి తెలుగు సాహిత్య విమర్శకు చక్కని మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. అనంతరం ఆచార్య సిమ్మన్నకు నిర్వాహకులు జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కె.వి.ఎ స్.మూర్తి, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, రామతాత, ఉప్పల అప్పలరాజు, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్ నరసింహం, భాగవతుల సత్యనారాయణ మూర్తి, డాక్టర్ కె.రాజశేఖర్, విశాలాంధ్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

న్యూస్‌రీల్

మూడు రైల్వే ప్రాజెక్ట్‌లకు బోర్డు ఆమోదం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టులకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి కృషితో ఇవి కార్యరూపం దాల్చనున్నాయని ఓ ప్రకటనలో వెల్లడించారు. దువ్వాడ–సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య 3, 4వ లైన్ నిర్మాణం, వడ్లపూడి–గేట్ జంక్షన్ క్యాబిన్ మధ్య గంగవరం పోర్టు–విశాఖ స్టీల్‌ప్లాంట్‌లతో కూడిన టై లైన్‌లో 3, 4వ లైన్ల నిర్మాణం, పెందుర్తి–సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య రైల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇందుకోసం సుమారు రూ.640.18 కోట్లు మంజూరు చేసిందని, వీటితో సుమారు 33 కిలోమీటర్ల ట్రాక్‌ల నిర్మాణం, ఫ్లై ఓవర్ పనులు ప్రారంభిస్తున్నట్లు డీఆర్ఎం తెలిపారు. ఈ పనులకు సంబంధించిన త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు.

సింహాద్రిలో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్‌టీపీసీలోని రెండో యూనిట్లో ఈ నెల 9న నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తిని మరమ్మతుల అనంతరం బుధవారం పునరుద్ధరించారు. సంస్థ రెండో యూనిట్‌లో ఈ నెల 9న ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. సాంకేతిక నిపుణులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి బుధవారం ఉదయం రెండో యూనిట్ నుంచి ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం నాలుగు యూనిట్ల నుంచి 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అధికారులు తెలిపారు.

ఆదాయ ఆర్జనలో విశాఖ ఆర్టీఏకు ప్రథమ స్థానం

గోపాలపట్నం: ఆదాయ ఆర్జనలో విశాఖ రవాణా శాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.410.72 కోట్లు లక్ష్యం కాగా.. రూ.418.82 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ.73.02 కోట్లు, జీవిత కాల పన్నుల ద్వారా రూ.291.17కోట్లు, ఫీజుల ద్వారా రూ.22.55 కోట్లు, సర్వీస్ ఛార్జీల ద్వారా రూ.4.99 కోట్లు, తనిఖీల ద్వారా రూ.27.09 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన, పన్నులు చెల్లించని వాహనాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం వల్ల లక్ష్యాన్ని సాధించగలిగామన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర పన్నుల శాఖలో బదిలీలు

విజయనగరానికి జేసీ–1 నాగార్జునరావు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర పన్నుల శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్(సీటీ) కార్యదర్శి గుల్జార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ డివిజన్ జాయింట్ కమిషనర్‌గా ఇటీవలే ఒ.ఆనంద్‌ను నియమించింది. ప్రస్తుతం జేసీ–1గా విధులు నిర్వర్తిస్తున్న బి.నాగార్జునరావును విజయనగరం డివిజన్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇటీవలే సస్పెన్షన్‌కు గురైన విశాఖపట్నం–2 డిప్యూటీ కమిషనర్ జయశంకర్ స్థానంలో రాజమండ్రి డివిజన్ డిప్యూటీ కమిషనర్ కె.అపర్ణని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో 10 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: జిల్లాలో బుధవారం మరో 10 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 276 మందికి పరీక్షలు నిర్వహించగా.. వీరిలో 10 మందికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 34కు చేరింది. కరోనా నుంచి కోలుకున్న ఐదుగురిని డిశ్చార్జ్ చేశారు. హోం ఐసోలేషన్‌లో 29 మంది, పలు ఆస్పత్రుల్లో ఐదుగురు చికిత్స పొందుతున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

నగరంలో నేడు
● ఉదయం 8:30 గంటలకు చినవాల్తేర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ● ఉదయం 10:30 గంటలకు పోర్టు కళావాణి స్టేడియంలో రోజ్‌గార్ మేళా ● మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే విశాఖ పోర్టు సందర్శన

7,931 మంది ఈబీసీలకు రూ.11.89 కోట్ల లబ్ధి

మహారాణిపేట: ఈబీసీ నేస్తం పథకం రెండో విడతలో భాగంగా జిల్లాలో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 7,931 మంది అగ్రవర్ణ పేదలకు రూ.11.89కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లా మర్కాపురంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం రూ.11,89,65,000లను మెగా చెక్కు రూపంలో లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే సంబంధిత సచివాలయంలో ఫిర్యాదు చేయాలని, వెంటనే ఆ సమస్య పరిష్కారమవుతుందన్నారు. వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమ దేవి, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున

ఎన్‌టీపీసీకి అపెక్స్ ఇండియా ఎక్స్‌లెన్స్ అవార్డు

పరవాడ: పర్యావరణ పరిరక్షణకు ఎన్‌టీపీసీ సింహాద్రి యూనిట్ చేస్తున్న కృషికి అపెక్స్ ఎన్విరాన్‌మెంట్ ఎక్స్‌లెన్స్ కేటగిరీలో ప్లాటినం అవార్డు ఆ సంస్థను వరించింది. గోవాలో అపెక్స్ ఇండియా – గ్రీన్ లీఫ్ అవార్డుల ప్రధానోత్సవంలో సింహాద్రి గ్రూపు జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఏజీఎమ్ డాక్టర్ విజయన్ షీల్డ్, సర్టిఫికెట్ ఆఫ్ రికగ్నేషన్ అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, అటవీ శాఖ సహకారంతో ఏటా 40 వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సంజయ్ కుమార్ సిన్హా, విజయన్

'ఎంఎస్‌ఎంఈ'లకు 'చాయ్ బిజినెస్'!

అవగాహన శిబిరం నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పించడానికి చాయ్ బిజినెస్ శిబిరాన్ని నిర్వహించారు. సిరిపురంలో వైజాగ్ పటం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం, అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఎంఎస్ఎంఈ మేటర్స్, ఆరో కన్సల్టింగ్‌లు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరం ద్వారా సూక్ష్మ సంస్థల పని సరళంగా, సమర్థవంతమైన డిజిటలైజేషన్‌ను ఉపయోగించుకుని తద్వారా వ్యాపార విస్తరణను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. అలాగే ఎంఎస్ఎంఈ పథకాలపై అవగాహన కల్పించడం, వారి అకౌంటింగ్, మానవ వనరులు, ఆన్‌లైన్ మార్కెటింగ్, ఎగుమతులపై చర్చించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌హెచ్‌ఐ మాగ్నెసియా ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపక డైరెక్టర్ ఆర్వీఎస్ రుద్రరాజు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ వ్యాపారాలకున్న అవకాశాలను వివరించారు. బిజినెస్ డెవలప్‌మెంట్ లీడ్ ప్రతినిధి సంజయ్‌సింగ్ స్మాల్ అండ్ మిడ్ మార్కెట్ సెగ్మెంట్ నుంచి భారత్, సార్క్ దేశాల కోసం అమెజాన్ సేవలు ఎలా వినియోగించుకుంటున్నాయో తెలియజేశారు. వనరుల నిర్వహణ, అకౌంటింగ్, చెల్లింపు గేట్‌వే తదితర అంశాలపై ఆరోహ్ కన్సల్టింగ్ వ్యవస్థాపకురాలు అరుంధతీ ముఖర్జీ మాట్లాడారు. కార్యక్రమంలో వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ మహిళా విభాగం కార్యదర్శి అనీలా నార్ల, గౌరవ కార్యదర్శి సంధ్య, జాజా వల్సరాజ్ తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

పీఎంపాలెంలో భూమాయగాళ్లు

● తప్పుడు ధ్రువపత్రాలతో భూముల అమ్మకం
● ముఠా గుట్టురట్టు.. ఐదుగురు అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న రబ్బరు స్టాంపులు


ప్రధాన నిందితుడు రామకృష్ణ ప్రసాద్

పీఎంపాలెం: పీఎంపాలెం, మధురవాడలో భూమాయగాళ్ల దందాలు ఆగడం లేదు. తాజాగా మరో భూ కబ్జాదారుల ముఠాను పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో మహిళలు ఉండటం విశేషం. నకిలీ డాక్యుమెంట్లు తయారీకి వీరు వినియోగించే సరంజామా చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఈ కేసుకు సంబంధించి సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. స్థానికంగా నివాసం ఉండని, మరణించిన వారి భూములే లక్ష్యంగా ఓ ముఠా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. ఆ భూములను విక్రయిస్తోంది. ఈ ముఠాకు నాయకుడు నక్కెళ్ల రామకృష్ణ ప్రసాద్ కాగా.. రెడ్డి శ్రీవిద్య, అవుగడ్డ వెంకటరమణ, రావాడ పద్మ, వలిసెట్టి జయశ్రీ మిగతా సభ్యులు. వీరు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో కొంతమందికి చెందిన భూములను 355 గజాల చొప్పున విక్రయించడానికి పకడ్బందీగా పథకం రచించారు. తమదికాని ఈ భూములకు నకిలీ ధ్రువీకరణపత్రాలు, టైటిల్ డీడ్ తదితర పత్రాలను సృష్టించి అమ్మకానికి పెట్టారు. ఈ క్రమంలో పెందుర్తికి చెందిన దాసరి మధుకిరణ్ డిసెంబర్‌లో ఇక్కడ కొన్ని ప్లాట్‌లు కొనుగోలు చేయడానికి అగ్రిమెంట్ కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా సుమారు రూ.85 లక్షలు చెల్లించాడు. లావాదేవీలకు సంబంధించి కాగితం మూలంగా రసీదులు ఆయన వద్ద ఉన్నాయి. తర్వాత ఆయనకు అనుమానం వచ్చి.. నకిలీ పత్రాలతో భూమిని విక్రయిస్తున్నట్లు గుర్తించి పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం రామకృష్ణప్రసాద్‌తో పాటు మిగిలిన సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నకిలీ డాక్యుమెంట్ల తయారీకి వీరు వినియోగిస్తున్న సరంజామాను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల 85 రబ్బరు స్టాంపులు, 11 బ్యాంకు పాస్ పుస్తకాలు, 60 చెక్కులు, 21 చెక్ బుక్కులు, 60 డాక్యుమెంట్లు, టైటిల్ డీడ్ పేపర్లు, ఒక కంప్యూటర్ ఉన్నాయి. గతంలో కూడా రామకృష్ణ ప్రసాద్‌పై భూకబ్జా కేసు నమోదైందని సీఐ తెలిపారు.

15 నుంచి ఫుట్‌బాల్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: మూడు దశాబ్దాల విరామం అనంతరం మరోసారి విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు విశాఖలో జరగనున్నాయి. ఈ ఆహ్వాన ఆలిండియా ఫుట్‌బాల్ ట్రోఫీలో 16 జట్లు నాలుగు పూల్స్‌లో రైల్వే స్టేడియం ఫుట్‌బాల్ మైదానం వేదికగా తలపడనున్నాయి. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు జట్ల షెడ్యూల్‌ను వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ప్రదర్శించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతాయన్నారు. 23న ఫైనల్ పోటీ ఉంటుందని.. విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50 వేల నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ సూపర్‌లీగ్ (పీఎఫ్‌ఎస్‌ఎల్) అధ్యక్షుడు దిలీప్‌వర్మ తెలిపారు. సునేబేడా, బ్లూస్టార్స్, మధ్యప్రదేశ్, ఏపీ, చెన్నై, విశాఖ, హైదరాబాద్, సిటీఎఫ్‌సీ, నాగపూర్, శ్రీధర్ స్పోర్టింగ్, ఎస్ఎఫ్ఏ, కోల్‌కతా, ఎస్ఏటీ, బర్మా, చత్తీస్‌గఢ్, డైచిమన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఎస్వీ ఆదినారాయణ, కె.ఎస్.వి ప్రసాద్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోటీల షెడ్యూల్ ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

సిటీలో షూటింగ్‌ల సందడి

కొమ్మాది: ప్రముఖ కథానాయకుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బుధవారం విశాఖ చేరుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పుష్ప–2 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను పోర్టు తదితర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నగరానికి చేరుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నాలుగు రోజుల పాటు ఇక్కడ జరుగుతుందని సమాచారం.

సైంధవ్ వచ్చేశాడు : హిట్ దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా 'సైంధవ్' చిత్రీకరణ గురువారం నుంచి నగరంలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో హీరోగా నటిస్తున్న విక్టరీ వెంకటేష్ నగరానికి చేరుకున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తుండగా.. వెంకట్ బోయనపల్లి నిర్మాత.

భీమిలిలో..
భీమిలి బీచ్ రోడ్డు కొబ్బరితోట వద్ద వెన్నెల కిశోర్ ప్రధాన పాత్ర పోషిస్తున్న సినిమా చిత్రీకరణ జరుగుతోంది. రాజారామ్మోహన్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను మరో రెండు రోజుల పాటు ఇక్కడ చిత్రీకరించనున్నారు. హీరోయిన్‌గా వకీల్‌సాబ్ ఫేం అనన్య నటిస్తున్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న విక్టరీ వెంకటేష్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

జూలో అందుబాటులోకి కొత్త బ్యాటరీ వాహనాలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జులాజికల్ పార్కులో కొత్త బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్నాళ్లుగా ఇక్కడ రెండు బ్యాటరీ వాహనాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. తాజాగా మరో 10 వాహనాలను సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూలో బ్యాటరీ వాహనాలను ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటి వల్ల శబ్దం, పొగ ఉండదని, కార్బన్ తీవ్రత తగ్గుతుందన్నారు. ఒక్కో వాహనంలో 10 మంది కూర్చుని జూలో వన్యప్రాణులను తిలకించవచ్చునని చెప్పారు. పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50 చొప్పున టికెట్ ధర నిర్ణయించామన్నారు. జూ ప్రధాన ద్వారంతో పాటు సాగర్‌నగర్ వైపు ద్వారం కూడా ఈ వాహనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు పాడేరు, అనకాపల్లి డీఎఫ్‌వోలు వినోద్‌కుమార్, లక్ష్మణ్, ఏసీఎఫ్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.


జూలో బ్యాటరీ వాహనాలు ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

ఇండస్ట్రియల్ పాలసీపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: ఇండస్ట్రియల్ పాలసీపై పారిశ్రామికవేత్తలకు ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని.. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ) జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి అన్నారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వాసీవా)లో బుధవారం ఇండస్ట్రియల్ పాలసీపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు, అనుమానాలను నివృత్తి చేశారు. వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం డీఐసీ జీఎం గణపతిని వాసీవా, ఐలా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, డీఐసీ ఏడీ కరుణాకర్, ఎంఎస్‌ఎంఈ ఏడీ కుమార్, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి డి.వినోద్, ఐలా మాజీ ప్రతినిధులు శేషగిరిరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐసీ జీఎం గణపతి

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన సీపీ


టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన సీపీ త్రివిక్రమ్ వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు

దొండపర్తి : విశాఖ పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ, డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందజేశారు. కొత్త సీపీ, డీసీపీలుగా బాధ్యతలు చేపట్టిన ఇరువురికి సుబ్బారెడ్డి అభినందనలు తెలియజేశారు.

హెచ్‌సీ కుటుంబానికి చెక్ అందజేత


చెక్‌ను అందజేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ షేక్‌ఖాదర్ వల్లీ కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెల్ఫేర్ నుంచి జీపీఏఐ క్లెయిమ్ ద్వారా వచ్చిన రూ.20 లక్షల చెక్‌ను అతని కుటుంబ సభ్యులకు నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ హెచ్‌సీ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 16న ప్రవేశ పరీక్ష

సింహాచలం: జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు గాను ఈనెల 16వ తేదీన పవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు సింహాచలంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. https://mjpapbcwreis.apcfss.in నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ(అమరావతి) విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వానికి పలు దఫాలు వినతిపత్రాలు అందజేశామని, ఇప్పటికే స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. బకాయి పడిన మూడు డీఏలు వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్‌కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథరావు, కార్యదర్శి సిహెచ్.వి.రమేష్, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎస్.రావు, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శారదారావు, పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న ఏపీ జేఏసీ(అమరావతి) జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి

జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఏర్పాటు


జోన్-5 స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది వసంతకుమారి

అల్లిపురం: జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఏర్పాటైంది. ఫిబ్రవరి ఒకటో తేదీన జరిగిన కౌన్సిల్ తీర్మానం ద్వారా ఎనిమిది జోన్లలో 8 మంది న్యాయవాదులను నియమిస్తూ జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణ, కోర్టు కేసులు పరిష్కారానికి కౌన్సిల్ పనిచేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జోన్–1కు సోముల రాంబాబు, జోన్–2కు వై.చిన్నయ్యదొర, జోన్–3కు అప్పారి వెంకట గిరిబాబు, జోన్–4కు మల్ల తులసీరామ్, జోన్–5కు యాగాటి వసంతకుమారి, జోన్–6కు గాజుల వెంకటలక్ష్మి, జోన్–7కు పి.సత్యనారాయణ మూర్తి, జోన్–8కు వాగుపల్లి చిన్నారావులను నియమించారు. వీరంతా ఏడాదిపాటు ఈ పదవిలో కొనసాగుతారని కమిషనర్ పేర్కొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.61,310
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,200
వెండి(కిలో):	రూ.81,400

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.107
స్కిన్	: రూ.184
స్కిన్‌లెస్	: రూ.194

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	420.00
విజయనగరం	424.00
శ్రీకాకుళం	424.00